క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం కృషి చేస్తుందని పలువురు వక్తలు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 75 సంవత్సరాలు వయస్సు పూర్తిచేసుకున్న 35 మంది పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ కంచుపర్తి సత్యనారాయణ, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాద్, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. తొలుత పెన్షనర్స్‌డే ప్రారంభకులు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల మృతి చెందిన అసోసియేషన్ సభ్యులకు శ్రద్ధాంజలి ఘటించారు.

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్



వినుకొండ(నూజెండ్ల): ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు వినుకొండ రూరల్ పరిధిలో నాగులవరం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మోహన్‌రావు మాట్లాడుతూ అపారమైన గణిత మేధస్సుతో ప్రపంచ చరిత్రలో నిలిచిన గొప్ప గణిత శాస్త్రవేత్త రామానుజన్ అన్నారు. విద్యార్థులు గణితంలో సరికొత్త ఆవిష్కరణతో రాణించటమే మనం ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, శైలజ, వ్యాయమా ఉపాధ్యాయులు అంకారావు, యల్లమంద, పద్మ, అనూషా, శాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలు..

వినుకొండ(నూజెండ్ల): గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా మ్యాట్రిక్స్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో ఐఐటీ మ్యాథ్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ అధినేత రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గణిత శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని అన్నారు. పరీక్షల్లో పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. నిర్వాహకులు సూర్యతేజ, హనుమంత రెడ్డి, డైరెక్టర్‌లు కిషోర్, మాలపాటి కోటిరెడ్డి, రఫీ, డాక్టర్ ఇన్నారెడ్డి, నారాయణ, శ్రీనివాసరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో యాచకులు, నిరాశ్రయులకు యంగ్‌స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ చలితీవ్రత పెరుగుతున్న కారణంగా ఫౌండేషన్ తరఫున సేవా కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఫౌండేషన్ సభ్యులు గుమ్మడి మనోహర్‌బాబు, పెనుమల వెంకట్రావు, అంబటి అంకారావు, సునీల్ కుమార్, పెనుమల బాలరాజు, అంబటి వెంకటేష్ పాల్గొన్నారు.

జాబ్ మేళా



సత్తెనపల్లి: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురాం నగర్‌లోని విద్యా కేంద్రం కళాశాలలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 950 మంది యువత మేళాకు హాజరు కాగా, వివిధ కంపెనీల ప్రతినిధులు 300 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

వైభవంగా శారదామాత జయంతి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో శ్రీ రామకృష్ణ సేవా మండలిలో ఆదివారం శారదామాత జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గండికోట విజయ్‌కుమార్ శర్మ నేతృత్వంలో శారదామాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదాలను, మిఠాయిలను పంపిణీ చేశారు.

కష్టాలు కొనసాగు!

- ముసురు వాతావరణంతో ఆందోళనలో అన్నదాతలు
- ఇప్పటికే వరికోతలు కోసి ఓదెలు వేసిన వైనం
- వర్షాలతో గింజ మొలకెత్తే అవకాశం
- గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలంటున్న రైతులు



శావల్యాపురంలో వరి పొలంలో కోత కోసి కట్టలు కట్టిన రైతులు

శావల్యాపురం: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి వాతావరణం అనుకూలించపోవటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి దిగుబడులు ఆశాజనకంగా ఉందని అనుకున్న సమయంలో వాతావరణ శాఖ తుఫాన్ ప్రకటించటంతో అన్నదాతలు ఢీలా పడుతున్నారు. ప్రస్తుతం వరి కోత కోసి ఓదెలు వేశారు. శనివారం రాత్రి మండలంలో వర్షం కురవడంతో వరి దిగుబడిని కాపాడుకోవడానికి రైతులు కష్టాలు పడ్డారు.

2500 ఎకరాల్లో వరిసాగు..

మండలంలోని 15 గ్రామ పంచాయతీలో ఈ సీజనులో 2500 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఒక్కో ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే అన్నదాతలు పొలాల్లోని పంటను యంత్రాల సాయంతో కోత కోసి పొలాల్లో ఓదెలుగా ఉంచారు. ముసురు ప్రభావంతో ఇప్పుడు పొలాల్లోనే దళారులకు తెగనమ్ముకుంటున్నారు. ఓదెల్లో తేమ వలన గింజలు మొలకెత్తుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకుని రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయాధికారులు తూతూమంత్రంగా పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాలు జరిపి చేతులు దులుపుకొంటున్నారు. తగిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు పెడుతుండడంతో చేసేదేమీ లేక రైతులు నష్టమైనా దళారులకు విక్రయిస్తున్నారు.

దిగుబడులు తగ్గుతాయి..



నేను నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ప్రస్తుతం వరి పంటను కోత కోసి ఓదెల్లో ఉంది. వర్షం వలన తేమశాతం వలన గింజ మొలకెత్తుతుందేమోనని ఆందోళనగా ఉంది. ఎకరానికి రూ.35 వేలు పెట్టుబడులు పెట్టాను. తుఫాన్ ప్రభావంతో దిగుబడులు తగ్గుతాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ముక్కపాటి నాగేశ్వరరావు, రైతు, కనమర్లపూడి

గిట్టుబాటు ధర కల్పించాలి



నేను 10 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ప్రస్తుతం వర్షం ప్రభావంతో ఆందోళనగా ఉంది. ఒక్కో ఎకరానికి రూ.వేలు పెట్టుబడులు పెట్టాను. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దళారులను ఆశ్రయించే పరిస్థితి లేకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలి.

– అల్లూరి వెంకట్రావు, రైతు, బొందిలిపాలెం

ఘనంగా ఆలయ ప్రతిష్టా మహోత్సవం



అర్చకులచే ఆశీర్వచనం తీసుకుంటున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



పోలేరమ్మతల్లి మూలవిరాట్

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలోని పోలేరమ్మ తల్లి అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొమ్మూరి విశ్వరూపాచార్యులు సిద్ధాంతి, బ్రహ్మశ్రీ కొలగాని ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో సహచర రుత్వికవరేణ్యుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపారు. ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా 22వ తేదీన ఉదయం 9 గంటలకు యంత్రస్థాపన, శిల విగ్రహ స్థిర ప్రతిష్టను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అందరి ఇళ్లకు బంధుమిత్రులు, ఆడపడుచుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం అన్న సంతర్పణ జరిపారు.

ఉద్యానహీనం!

అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా నూజెండ్ల పార్కు



పార్కులోని ఊయల దుస్థితి

వినుకొండ(నూజెండ్ల): ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కులు అధికారుల నిర్లక్ష్యం వలన నిరుపయోగంగా మారుతున్నాయి. మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో ఉన్న ఉద్యానవనం నేడు ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. 2018లో ఉపాధి పథకం నిధులు రూ.8.43 లక్షలతో పార్కును నిర్మించారు. అధికారుల ముందు చూపు లేకపోవటంతో చుట్టుపక్కల పొలాల్లోని నీరు పార్కులోకి చేరి దుర్గంధం వెదజల్లుతుంది. రాత్రిళ్లు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారింది. అంతేకాక గేదెలు, జంతువులు పార్కులో స్వైర విహారం చేస్తుంటాయి. ఉద్యానవనంలో జాతీయ నాయకులు విగ్రహాలను ఉయ్యాల జారుడు బల్లలను దాతలు వితరణ చేసిన బెంచీలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. రూ.లక్షలతో నిర్మించిన ఉద్యానవనం అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వలన ఈ దుస్థితికి వచ్చిందని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పార్కును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

మహాజన దళిత సమితి నిరసన



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎండీఎస్ బాధ్యులు

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించేలా వాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను క్యాబినెట్ నుంచి తొలగించాలని మహాజన దళిత సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దీపాల పరంధామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు.. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరంధామయ్య మాట్లాడుతూ అమిత్ షా వెంటనే భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అమిత్ షాను ఎన్నికల్లో పోటీ చేయనీకుండా నిషేధించాలని, దేశం నుంచి బహిష్కరించాలన్నారు. ఎండీఎస్ సీనియర్ నాయకులు పెద్దింటి నాగేశ్వరావు, చిలుకా రమణయ్య, యువజన నాయకులు ముదిగొండ ఈశ్వర్ మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు సిద్ధేల మోహనరావు, గుంటూరు గోవిందు, జమండ్లమూడి ప్రభాకర్, గంగారాం, రవి, శివ కుమార్, సుధాకర్, పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి



మాట్లాడుతున్న పులిపాటి వెంకట పవన్‌కుమార్

అమరావతి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సనాతన హిందూ ధర్మం, దేవాలయాల రక్షణకు జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావానికి తరలి రావాలని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి పులిపాటి వెంకట పవన్ కుమార్ కోరారు. ఆదివారం స్థానిక సరస్వతీ శిశు మందిర్‌లో నిర్వహించిన హైందవ శంకారావ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో హిందువుల ఐకమత్యం కొరవడి, హైందవ ధర్మానికి విఘాతం కలుగుతోందన్నారు. రాజకీయాలకు, స్వార్థ ప్రయోజనాలకు వాడుకుని హిందువులు, హిందూ దేవాలయాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువుల చైతన్యం కోసమే శంకారావం నిర్వహిస్తున్నామన్నారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోలా వెంకటేశ్వరరావు, వారణాశి వెంకటేశ్వరశర్మ, కౌశిక ప్రసాద్ తదితరులు ప్రసగించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నరసరావుపేట రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ నరసరావుపేట, ఎంవీ రెడ్డి కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో రాజుపాలెం లింగంగుంట్లలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 218మంది వైద్య శిబిరానికి హాజరయ్యారు. డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి వీరికి పరీక్షలు జరిపి 48 మంది పొరల సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. అలాగే మరో 30 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, మహానందరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రత్నకరం రాము, గంధం వెంకట సూర్యనారాయణ, రత్నకరం వరప్రసాద్, రాయవరపు సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

చిలకలూరిపేట: ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. చిలకలూరిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో రెండు నూతన బస్సులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణీకులతో మాట్లాడి ఆర్టీసీ సేవలపై ఆరా తీశారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలోని షాపులను, క్యాంటిన్‌ను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతపై ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాంబాబు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ముప్పాళ్ళ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై యు.సోమేశ్వరరావు తెలిపారు. సత్తెనపల్లి–నరసరావుపేట రోడ్డులోని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపటం నేరమని, తప్పని సరిగా నడిపే వ్యక్తి వద్ద లైసెన్స్ ఉండాలని సూచించారు. కారు నడిపే వారు కూడా సీటు బెల్ట్ ధరించాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రుల కూడా బాధ్యులవుతారన్నారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారికి అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో ఏఎస్సై మాధవరావు, నవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవాలయంలో ఆదివారం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం జరిగి 16 రోజులు అయిన సందర్భంగా విశేషంగా వసంత కార్యక్రమం, పవళింపు సేవా కార్యక్రమం, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విజయపురిసౌత్: స్థానిక శివ గణేష్ హోటల్ వెనుక ప్రదేశంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి రూ.3,580 నగదును స్వాధీన పరచుకొని నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను మాచర్ల కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జనవరి 3వ తేదీన ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు షేక్ జానీ, సన్ని ఆదివారం తెలిపారు. కన్నెగంటి భార్గవ్ నాయకుడు జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.22,222, రెండవ బహుమతి రూ.17,777, మూడవ బహుమతి రూ.12,222తో పాటు షీల్డ్‌లను అందజేయనున్నారు. క్రీడాకారులు రూ.149తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. టీమ్ కెప్టెన్ ఎంట్రీ కోసం రూ.1,999 చెల్లించాలన్నారు. ఈ క్రికెట్ పోటీల కోసం ఈ నెల 25వ తేదీ ఆక్షన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్ టోర్నమెంట్ జనవరి 3వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. క్రికెట్ ఆటగాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరన్ని వివరాల కోసం 9502300411, 8522999880 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ పిడుగురాళ్ల పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రేమ, క్షమ.. క్రీస్తు లోకానికి ఇచ్చిన సందేశం

చర్చి ప్రతిష్ట మహోత్సవంలో మాజీ మంత్రి విడదల రజిని



ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం జీసెస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని గంగన్నపాలెం గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ప్రతిష్ట కార్యక్రమంలో శనివారం రాత్రి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, సంఘ పెద్దలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్చి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. క్రీస్తు బోధనలు అందరూ ఆచరిస్తే ఉత్తమ సమాజం సాకారం అవుతుందన్నారు. క్రీస్తు అందించిన సందేశం, విలువలను గుర్తు చేసుకోవడానికి ఇది ఒక గొప్ప సందర్భమని వెల్లడించారు. ఎంపీపీ దేవినేని శంకరరావు, పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యేలు చదలవాడ, ప్రత్తిపాటి

నాదెండ్ల: పేదలకు ఉచిత వైద్య సేవలందించే ఉద్దేశ్యంతో ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం గుంటూరు చంద్ర హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి అరవిందబాబు ప్రారంభించారు. వైద్యులు నల్లమోతు శరత్‌చంద్రకుమార్ బృందం 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం సాతులూరు విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హైస్కూలులో మొక్కలు నాటారు. హైస్కూలులో డాక్టర్ అరవిందబాబు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ల్యాబ్, సైకిల్‌స్టాండ్‌ను ప్రారంభించారు. అనంతరం ఇరువురు ఎమ్మెల్యేలను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభారాణి, ఉపసర్పంచ్ శరభయ్య, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన రాష్ట్రానికి స్వర్ణయుగం



నాదెండ్లలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడిచిన ఐదేళ్ల సంక్షేమం, అభివృద్ధి నిరాటంకంగా కొనసాగాయని, జగనన్న పాలన రాష్ట్రానికి స్వర్ణ యుగమని మాజీ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల అంబేద్కర్ కాలనీ, రామాపురం కాలనీల్లో శనివారం రాత్రి పర్యటించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాయపూడి చెంచురాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు యల్లారావు, ఏసమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాయకులు కాట్రగడ్డ రామకృష్ణ, సింగారెడ్డి కోటిరెడ్డి, గంగినేని అప్పారావు, శివకామేశ్వరరావు, మిరియాల చినకోటయ్య, ఆలా శివకోటి తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు కొనసాగింపు



కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు

అచ్చంపేట: మాదిపాడు నుంచి జడపల్లి తండా, కంచుబోడు తండాలను కలుపుతూ పులిచింతల ప్రాజెక్టు ఘాట్ రోడ్డు వరకు సుమారు 6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగం పుంచుకున్నాయి. మాదిపాడు నుంచి కంచుబోడు తండా, జడపల్లి తండా వరకు పక్కా రోడ్డు వేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.3.50కోట్లు నా బార్డు నిధులు మంజూరు అయిన విషయం తెలిసిందే. అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రోడ్డు నిర్మాణానికి మాదిపాడు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కొంతమేర గ్రావెల్, డస్ట్‌తో రోడ్డు వేశారు. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులను అధికారులు తిరిగి వేగవంతంగా కొనసాగించడం పట్ల తండా వాసులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుకు గ్రావెల్, డస్ట్ వేసి, తారువేస్తున్నారు. మరో పది పదిహేను రోజుల్లో పూర్తి కావచ్చు. కంచుబోడు తండా, జడపల్లి తండాల వద్ద ఉన్న లో లెవల్ చప్టా పనులను కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా కల్యాణ్



చిల్లంచర్ల కల్యాణ్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా చిల్లంచర్ల కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య గో సంరక్షణ శాల కల్యాణ మండపంలో ఆదివారం తనతో పాటు యువజన సంఘం బాధ్యులందరి చేత ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షుడిగా కొత్త రామకృష్ణ, గౌరవ సలహాదారులుగా పెరుమాళ్ల అమర్, బచ్చు మురళీకృష్ణ, యక్కల సతీష్ కుమార్, మద్ది రాజేష్ బాబు, ఉపాధ్యక్షులుగా జవ్వాజి రవికృష్ణ, ఆకి కిరణ్ కుమార్, గుంటూరు హరీష్, దేవతి పవన్, కార్యదర్శిగా కొత్తూరి హరి మణికంఠ, సహాయ కార్యదర్శులుగా వనమా రాజేష్, దొడ్లా తరుణ్, భవిడిశెట్టి సాయి, బాలనాగు రామారావు, కోశాధికారిగా దేసు రాజేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నాళం మణితేజ, బచ్చు గణేష్, మీడియా ఆర్గనైజర్స్‌గా దివ్వెల సతీష్‌కుమార్, కొప్పురావూరి ప్రసాద్ ఆదిత్య, మరో 13 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.